సాక్షి ఏలూరు

ఆదివారం । 22 । అక్టోబర్ । 2023



మావుళ్లమ్మ సన్నిధిలో..

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం మావుళ్లమ్మవారిని రాష్ట్ర జీఎస్టీ కమిషనర్ కె.రవిశంకర్ దంపతులు దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు.

శ్రీనివాసా.. గోవిందా..

ద్వారకాతిరుమల: భవానీ దీక్షాధారులు, భక్తులతో చినవెంకన్న క్షేత్రం కిటకిటలాడింది. క్షేత్ర పరిసరాలు సందడిగా మారాయి. అన్ని విభాగాలూ రద్దీగా కనిపించాయి.

జెడ్పీ డిప్యూటీ సీఈఓగా నిర్మలాజ్యోతి

ఏలూరు (మెట్రో): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రజాపరిషత్ డిప్యూటీ సీఈఓగా ఎస్. నిర్మలాజ్యోతి శనివారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

న్యూస్‌రీల్

సజావుగా ఎన్నికల సామగ్రి తనిఖీ

ఏలూరు(మెట్రో): ఈవీఎంలు, వీవీ ప్యాట్‌ల మొదటి దశ తనిఖీ ప్రక్రియ తీరును కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక కలెక్టరేట్ కాంపౌండ్‌లోని ఈవీఎం గోడౌన్‌లో ఈవీఎంలు, వీవీ ప్యాట్‌ల ఫస్ట్ లెవిల్ చెకింగ్ తీరును ఆయన పరిశీలించారు. అధికారులు, సిబ్బంది ఎన్నికల కమిషన్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. విధులు నిర్వహిస్తున్న సిబ్బంది తప్పనిసరిగా గుర్తింపు కార్డులు ధరించాలన్నారు. తనిఖీ ప్రక్రియ సజావుగా సాగుతుందన్నారు. ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ చల్లన్న దొర ఉన్నారు.

జిల్లా పరిశ్రమల అధికారిగా నాగరాజా



ఏలూరు(మెట్రో): జిల్లా పరిశ్రమల అధికారిగా జె.నాగరాజా శనివారం బాధ్యతలు చేపట్టారు. ముందుగా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్‌ను కలిసి పూలమొక్క అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి పథంలో నిలిపేందుకు కృషిచేయాలని, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని సూచించారు. నాగరాజా అన్నమయ్య జిల్లా పరిశ్రమల అధికారిగా పనిచేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు. జిల్లా పరిశ్రమల కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ జేసుదాసు ఉన్నారు.

దైవ దర్శనానికి వెళుతూ..



మణికంఠ మృతదేహం

భీమడోలు: జాతీయ రహదారిపై కాలినడకన విజయవాడ వెళుతుండగా ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొన్న ప్రమాదంలో భవానీ మాలదారుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా పెద్దాపురం పట్టణానికి చెందిన మాలధారుడు తూరుపెల్లి మణికంఠ (22) భవానీ మాల ధరించి మండల దీక్ష పూర్తిచేసుకున్నాడు. తోటి మాలధారులతో కలిసి కాలినడకన విజయవాడ బయలుదేరాడు. మార్గమధ్యంలో ఏలూరు జిల్లా భీమడోలు మండలం అంబర్‌పేట పంచాయతీ శివారు కొండ్రెడ్డినగర్ వద్ద వేగంగా వచ్చిన వరపుత్ర ట్రావెల్స్ బస్సు శనివారం అతడిని ఢీకొట్టింది. అతడి తలకు బలమైన గాయం కాగా బస్సు డ్రైవర్ ఆటోలో భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలిస్తుండగా మృతిచెందాడు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు ఎస్సై చావా సురేష్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మణికంఠ వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నాడు.

అమరవీరుల త్యాగాలు మరువలేం

ఘనంగా పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం





ఏలూరులో అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న డీఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ మేరీ ప్రశాంతి, జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు టౌన్: పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేమని, వారు చరిత్రలో నిలిచిపోతారని ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్ అన్నారు. ఏలూరులోని పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా డీఐజీ అశోక్‌కుమార్, కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఎస్పీ మేరీ ప్రశాంతి, అసిస్టెంట్ కలెక్టర్ పూజ, డీఎఫ్‌ఓ శివశంకర్ తదితరులు అమరవీరుల స్థూపం వద్ద పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విధుల్లో ఎన్ని ఒత్తిళ్లు ఎదురైనా పోలీసులు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. అంతర్గత శత్రువుల నుంచి రక్షణ కల్పించేది పోలీసులే అన్నారు. డీఐజీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలకు ఎల్లవేళలా అండగా నిలుస్తూ శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు మరింత చిత్తశుద్ధితో పనిచేయాలని పిలుపునిచ్చారు. జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి మాట్లాడుతూ.. పోలీస్ ఉద్యోగమంటే క్రమశిక్షణ, చిత్తశుద్ధి, అంకితభావం, త్యాగానికి నిదర్శనమన్నారు. జిల్లా పోలీస్ శాఖ నిత్యం తమ నైపుణ్యాలను పెంపొందించుకుంటూ అందించిన సేవలకు దేశంలో ఉత్తమ పోలీస్‌గా నిలిచారని ప్రశంసించారు. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కరణంకుమార్, అదనపు ఎస్పీ ఎంజేవీ భాస్కరరావు, ఏఆర్ అదనపు ఎస్పీ శేఖర్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, ఏలూరు డీఎస్పీ ఈ.శ్రీనివాసులు, డీటీసీ డీఎస్పీ కె.ప్రభాకరరావు, ఏఆర్ ఆర్ఐ పవన్‌కుమార్, ఏలూరు ట్రాఫిక్ సీఐ వరప్రసాద్, ఏలూరు దిశ సీఐ విశ్వం, ఎస్‌బీ సీఐ ఎం.సుబ్బారావు, డీసీఆర్‌బీ సీఐ దుర్గాప్రసాద్, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు నాగేశ్వరరావు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

భారీ ర్యాలీ : పోలీస్ పరేడ్ గ్రౌండ్స్ నుంచి భారీ ర్యాలీని డీఐజీ అశోక్‌కుమార్, జిల్లా ఎస్పీ, అధికారులు జెండా ఊపి ప్రారంభించారు. ఏలూరు అమీనాపేట నుంచి ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సెంటర్, ఫైర్‌స్టేషన్ సెంటర్, ఎన్‌ఆర్‌పేట, జెడ్పీ కార్యాలయం కలెక్టరేట్ మీదుగా ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌కు ర్యాలీ చేరుకుంది. ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో భారీ మానవహారం చేపట్టారు.

● అమ్మా.. భవానీ



జై భవానీ.. జైజై భవానీ..

కరుణించమ్మా.. కనకదుర్గమ్మా.. అంటూ భక్తులు నీరాజనాలు అర్పించారు. శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవార్లు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. జిల్లావ్యాప్తంగా దసరా వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. విశేష అలంకరణలో దర్శనమిస్తున్న రాట్నాలకుంటలో రాట్నాలమ్మవారి దృశ్యమిది. - పెదవేగి

వైఎస్సార్‌సీపీలోకి భారీ చేరికలు



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్సీ జయమంగళ, ఎమ్మెల్యే డీఎన్నార్

కలిదిండి: రాష్ట్రంలో సీఎం జగన్ అమలుచేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు. మండలంలోని పెదపూట్లపూడిలో ఎమ్మెల్సీ జయమంగళ చొరవతో 200 మంది టీడీపీ కార్యకర్తలు ఎమ్మెల్యే డీఎన్నార్ సమక్షంలో శనివారం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు మాట్లాడుతూ సీఎం జగన్ రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో ముందంజలో నిలబెడుతున్నారని, నియోజకవర్గ అభివృద్ధికి తాము కృషిచేస్తున్నామన్నారు. టీడీపీ కార్యకర్తలకు పార్టీ కండువాలు కప్పి స్వాగతం పలికారు. పార్టీలో చేరిన వారిలో కొల్లాటి దుర్గారావు, ముత్యాలరావు, వెంకటేశ్వరరావు, కొక్కిలిగడ్డ సత్యనారాయణ, మోక జానకీరాం, నడకుదిటి ఏడుకొండలు, వాటాల రామారావు, కొల్లాటి లోకేష్, నాగ శ్రీను, కొక్కిలిగడ్డ ఆదినారాయణ, నాగమల్లి, నడకుదిటి చలపతిరావు, నాని, వాటాడి ఆనందరావు, తిరుమాని లక్ష్మణ్, కోకా వెంకటరమణ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ అయినాల బ్రహ్మాజీ, నాయకులు సయ్యపురాజు గుర్రాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు తిరుమాని గణపతి తదితరులు పాల్గొన్నారు.

విషాదం నింపిన విహారయాత్ర

- గోదావరిలో నలుగురు యువకుల గల్లంతు
- యానాం విహార యాత్రకు వెళ్లగా ఘటన
- తాళ్లరేవు మండలం గోపులంక పుష్కర్‌ఘాట్ వద్ద ప్రమాదం
- తణుకులో విషాదఛాయలు



గల్లంతైన వారు ముద్దన ఫణీంద్రగణేష్, హనుమకొండ సాయికార్తీక్, పెండ్యాల బాలాజీ, తిరుమల రవితేజ (ఫైల్)

తణుకు: విహారయాత్రకు వెళ్లి గోదావరిలో దిగిన నలుగురు యువకులు గల్లంతు కావడంతో తణుకులో తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి. తణుకు పట్టణానికి చెందిన ఏడుగురు యువకులు విహారం కోసం యానాం వెళ్లి తిరుగు ప్రయాణంలో తాళ్లరేవు మండలం గోపులంక వద్ద పుష్కరఘాట్‌లో స్నానానికి దిగారు. వీరిలో నలుగురు గల్లంతు కాగా ముగ్గురు సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు. హనుమకొండ సాయికార్తీక్ (21), ముద్దన ఫణీంద్రగణేష్ (21), పెండ్యాల బాలాజీ (21), తిరుమల రవితేజ (21) గల్లంతుకాగా నేదూరి భానుప్రసాద్, కొమ్మిరెడ్డి చైతన్య, సలాది దుర్గామహేష్ సురక్షితంగా బయటపడ్డారు. అయితే గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు జరుగుతుండగా ఆయా కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది.

పుట్టినరోజు పార్టీ కోసం వెళ్లి..

తణుకుకి చెందిన వీరంతా కలిసి శనివారం ఉదయం మూడు మోటార్ సైకిళ్లపై యానాం బయలుదేరి వెళ్లారు. సాయికార్తీక్‌ది వారం రోజుల క్రితం పుట్టినరోజు కాగా స్నేహితులకు పార్టీ ఇస్తానని చెప్పి స్కూల్ ఫ్రెండ్స్ అందరినీ కలిపి యానాం తీసికెళ్లినట్టు తోటి స్నేహితులు చెబుతున్నారు. గల్లంతైన వారిలో సాయికార్తీక్ డిప్లొమా మధ్యలో ఆపేయగా, ఫణీంద్రగణేష్ బీటెక్ సెకండియర్, బాలాజీ బీటెక్ ఫైనలియర్ చదువుతుండగా, రవితేజ డిగ్రీ పూర్తి చేసి ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నాడు. సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్న భానుప్రసాద్ డ్రైవర్‌గా పనిచేస్తుండగా దుర్గామహేష్ బీటెక్ ఫైనలియర్ చదువుతున్నాడు. కొమ్మిరెడ్డి చైతన్య బిర్యానీ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. గల్లంతైన ఫణీంద్రగణేష్ సోదరి వివాహం ఇటీవల జరగ్గా తండ్రి ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశానికి వెళ్లారు. అయితే యానాంలో పార్టీ చేసుకున్న వీరంతా తిరిగి స్వస్థలాలకు సాయంత్రం సుమారు 4 గంటల సమయంలో బయలుదేరారు. యానాం నుంచి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న గోపులంక గ్రామంలోని పుష్కర్‌ఘాట్ వద్దకు చేరుకుని గోదావరిలో స్నానానికి దిగడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ముందుగా సాయికార్తీక్ గట్టుపైనుంచి గోదావరిలో దూకి మునిగిపోతుండగా అతడిని కాపాడేందుకు వెళ్లిన ఫణీంద్రగణేష్, బాలాజీ, రవితేజ కొట్టుకుపోయినట్టు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. భానుప్రసాద్, చైతన్య, దుర్గామహేష్ సైతం వీరిని కాపాడేందుకు ప్రయత్నించినా కళ్ల ముందే నీటి ప్రవాహానికి కొట్టుకుపోవడంతో వెనుదిరిగి ఒడ్డుకు చేరుకున్నారు.



ప్రమాదానికి ముందు స్నేహితులంతా కలిసి తీసుకున్న సెల్ఫీ

ఇంటర్ ఫెయిలైనవారితో పరీక్ష ఫీజు కట్టించాలి

సాక్షి, భీమవరం: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఫెయిల్ అయిన విద్యార్థులు తిరిగి పరీక్షలు రాయడానికి ఫీజు చెల్లించేలా కళాశాలల అధ్యాపకులు కృషి చేయాలని ఇంటర్మీడియట్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.చంద్రశేఖర్‌బాబు సూచించారు. భీమవరంలోని సీఎస్ఎన్ కళాశాలలో శనివారం ఇంటర్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గడిచిన రెండేళ్లల్లో ఇంటర్ రెండో ఏడాది పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులను గుర్తించి వారిని తిరిగి పరీక్ష రాసేలా ప్రోత్సహించాలన్నారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో మంచి ఫలితాలు సాధించే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దాలని చంద్రశేఖర్‌బాబు అన్నారు. ఈ సమావేశంలో వివిధ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.



సందడిగా దసరా మార్కెట్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): దసరా పండుగ రాకతో అన్ని రకాల వ్యాపారులు ఉత్సాహంగా ఉంటారు. అయితే ఈ ఏడాది ఆ ఉత్సాహం రెట్టింపు అయిందనే చెప్పాలి. ఇటీవల అధిక శ్రావణం కారణంగా నెల రోజులు అన్ని వ్యాపారాలు వెలవెలపోయాయి. అయితే నిజ శ్రావణ మాసం రాకతో వ్యాపారులకు కొత్త ఉత్సాహం తెచ్చింది. అనంతరం వినాయక చవితి, వెనుకే దసరా పండగలతో వ్యాపారాలు పుంజుకున్నాయి. అలాగే కొన్ని రోజుల్లో దీపావళి కూడా రానుండడంతో మరికొన్ని రోజులు వ్యాపారాలు జోరుగా సాగుతాయనే ఆలోచనే వ్యాపారుల్లో రెట్టించిన ఉత్సాహాన్ని ఇస్తోంది.


నగరంలో ఆర్ఆర్‌పేటలోని ఓ వస్త్ర దుకాణంలో కిటకిటలాడుతున్న ప్రజలు

ప్రత్యేక ఆఫర్లతో ఆకర్షణ

కొత్త వాహనాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు విజయదశమి సందర్భంగా కొనుగోలు చేస్తే వాటి మన్నిక, భద్రత బాగుంటుందని ప్రజల నమ్మకం. ఈ నేపథ్యంలో ఆయా వాహనాల తయారీదారులు, డీలర్లు విజయదశమికి ప్రత్యేక ఆఫర్లతో వినియోగదారులను ఆకర్షిస్తుంటారు. ఈ ఏడాది సైతం వాహనాల కొనుగోలుపై తగ్గింపు, సులభ వాయిదాల్లో చెల్లించుకునే అవకాశం, రిజిస్ట్రేషన్ చార్జీల్లో తగ్గింపునిస్తున్నాయి. ప్రధాన కూడళ్లలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి వాహనాలతో పాటు టీవీ, ఫ్రిడ్జ్, వాషింగ్ మెషీన్, ఏసీ, ఎయిర్ కూలర్స్ తదితరమైనవి ప్రత్యేక తగ్గింపు ధరలకు విక్రయిస్తున్నారు. కొన్ని షోరూమ్‌లలో కొనుగోళ్లపై లక్కీ డిప్‌ను సైతం అమలు చేస్తూ డ్రాలో గెలిస్తే కార్లు, మోటార్ సైకిళ్లు, టీవీలు, ఫ్రిజ్‌లు వంటి బహుమతులు అందిస్తున్నాయి.

ఆన్‌లైన్ షాపింగే నయా ట్రెండ్

స్మార్ట్ ఫోన్ల ద్వారా సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో షాపింగ్ మరింత సులభతరమైంది. ఎంత ఖరీదైన వస్తువునైనా ఆన్‌లైన్‌లో కొనేస్తున్నారు. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి బహుళజాతి సంస్థల రాకతో ఆన్‌లైన్ షాపింగ్‌పై మరింత అవగాహన పెరిగింది. షోరూమ్, ఆన్‌లైన్ ధరలను బేరీజు వేస్తూ వస్తువులను కొనుగోలు చేస్తుండటం విశేషం.

డ్రైవింగ్‌లో నిర్లక్ష్యంగా ఉంటే మూల్యం తప్పదు


పరిహారం చెక్కును అందిస్తున్న జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి జి.రామగోపాల్

ఏలూరు (టూటౌన్): ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తగా వాహనాలు నడపాలని, లేకపోతే మూల్యం చెల్లించుకోక తప్పదని మొదటి అదనపు జిల్లా జడ్జి, జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి జి.రామగోపాల్ అన్నారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా శనివారం వాహన ప్రమాద బీమా, రెవెన్యూ కేసులపై ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ భవన్‌లో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రమాదంలో మృతుల కుటుంబాలకు సత్వర పరిహారం అందించడం కోసం ఈ ప్రత్యేక లోక్ అదాలత్ ఉపయోగపడుతుందన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ అవగాహన కార్యక్రమంలో రెండో అదనపు జిల్లా జడ్జి పి.మంగాకుమారి, ఎనిమిదో అదనపు జిల్లా జడ్జి ఎం.సునీల్ కుమార్, ఐదో అదనపు జిల్లా జడ్జి జి.రాజేశ్వరి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కేకేవీ బుల్లికృష్ణ, బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ నోముల రాముడు, ప్రభుత్వ న్యాయవాది బీజే రెడ్డి, మానసిక వైద్యులు వంశీకృష్ణ, పలువురు న్యాయవాదులు, వివిధ బీమా కంపెనీల అధికారులు పాల్గొన్నారు.

ప్రత్యేక లోక్ అదాలత్‌లో 72 కేసుల పరిష్కారం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించిన ప్రత్యేక లోక్ అదాలత్‌లో మొత్తం 72 వాహన ప్రమాద కేసులు పరిష్కారమై మొత్తం రూ.4 కోట్ల 10 లక్షల 70వేలు ప్రమాద బీమాగా చెల్లించనున్నారు. అదేవిధంగా మూడు వర్క్‌మెన్ కాంపెయిన్ కేసులకు సంబంధించి రూ.19.19 లక్షలు, ఒక ప్రీలిటిగేషన్ కేసులో రూ.3 లక్షలు పరిహారంగా చెల్లించనున్నారు. న్యూ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీకి సంబంధించి ఒక కేసు రూ.25 లక్షలను పరిహారంగా చెల్లించారు. ప్రత్యేక లోక్ అదాలత్ సందర్భంగా న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బందికి, న్యాయవాద గుమస్తాలకు ఉచిత కంటి వైద్య పరీక్షలను నిర్వహించారు.













పెన్నాడలో చోరీ

పాలకోడేరు: పెన్నాడలో తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో చోరీ జరిగింది. గ్రామంలో కడిమి దుర్గారావు ఈ నెల 18న ఇంటికి తాళం వేసి ఊరు వెళ్లాడు. శనివారం తిరగొచ్చేసరికి ఇంటి తలుపులు బద్దలు కొట్టి బీరువాలో ఉన్న ఆరు కాసులు బంగారం, నగదు చోరీకి గురైనట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టామని ఎస్సై నాళం శ్రీనివాసరావు తెలిపారు.





